# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **వచ్చే జులై నెల నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు.**

2. **ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థల్లో మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలకు ఈ రోజు ఎన్నికలు జరగనున్నాయి.**

3. **శ్రీకాకుళం నగరంలో అతిసార వ్యాప్తి నియంత్రణకు తాగునీటి పైపులైన్లు, డ్రైనేజీ వ్యవస్థలను పునరుద్ధరిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

4. **తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.**

==========================

వచ్చే జులై నెల నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేసి మార్కాపురం జిల్లా ప్రజలకు సాగునీటి అందజేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. మార్కాపురం జిల్లా పెద్దదోర్నాల మండలం గంటవానిపల్లె సమీపంలో 436 కోట్ల రూపాయలతో చేపట్టనున్న వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ ఆధునీకరణ పనులకు ముఖ్యమంత్రి నిన్న శంకుస్థాపన చేశారు. అనంతరం మార్కాపురంలో నిర్వహించిన బహిరంగసభలో చంద్రబాబు నాయుడు ప్రసంగిస్తూ, ఈ ఏడాది వెలిగొండ, వచ్చే సంవత్సరం పోలవరం ప్రాజెక్టులను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. రాయలసీమతో పాటు ప్రకాశం, మార్కాపురం జిల్లాలను ఉద్యానవన కేంద్రంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని నెల్లూరు, ఏలూరు నగరపాలక సంస్థల్లో మేయర్, డిప్యూటీ మేయర్ స్థానాలకు ఈరోజు ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం, ఈ రోజు ఉదయం 11 గంటలకు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంది. ఒకవేళ అనివార్య కారణాల వల్ల లేదా ఏవైనా ఇతర ఇబ్బందుల వల్ల సమావేశం నిర్వహించలేని పరిస్థితి తలెత్తితే, రేపు తప్పనిసరిగా సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికలు నిర్వహించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది.

---

ఆంధ్రప్రదేశ్ లో ఉన్న సహజ ఖనిజ వనరులను వెలికితీసి యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. విజయవాడలో ఏపీఎండీసీ ఆధ్వర్యంలో " బీచ్ సాండ్ ఖనిజాల నుంచి టైటానియం, అరుదైన భూ ఖనిజాలు, ఆంధ్రప్రదేశ్‌లో దేశీయ విలువ పెంపు, గొలుసుల నిర్మాణం : అవకాశాలు" అనే అంశంపై నిర్వహించిన కార్యశాలలో మంత్రి నిన్న పాల్గొని మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతం ఖనిజాల నిలయమని రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి 'బీచ్ సాండ్ ఖనిజాలు కీలకమని తెలిపారు.

వాయిస్..30 సెకన్లు

---

తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలోని రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నామని చెప్పారు. మొదటి దశలో.. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తహసీల్దార్ కార్యాలయాలు, 5 ఆర్డీవో కార్యాలయాలకు ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. రెండో విడతలో.. 170 కార్యాలయాలను నిర్మిస్తామని మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్ లో ఇంటర్మీడియట్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈరోజు ఆంగ్ల పరీక్ష జరుగుతుంది.

తెలంగాణాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు ఈరోజు నుంచి ప్రారంభం కానున్నాయి. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఈరోజు సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష జరుగుతుంది.

---

కేంద్ర ప్రభుత్వ తీసుకువచ్చిన వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ ఆజీవికా మిషన్ గ్రామీణ్ - VB G RAM G పథకంపై అవగాహన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ లోని విశాఖపట్నంలో నిన్న నిర్వహించారు. కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో దేశవ్యాప్తంగా 15 రాష్ట్రాల నుంచి 30 మంది అధికారులు పాల్గొన్నారు. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయం పెంపొందించడం, పథకం అమలు విధానాలు, లక్ష్యాలు, అమలుకు అవసరమైన మార్గదర్శకాలపై ఈ సమావేశంలో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అసిస్టెంట్ కమిషనర్ దీక్ష మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు అవసరమైన అవగాహన కల్పించడమే లక్ష్యంగా రేపటి వరకు ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్ లోని శ్రీకాకుళం నగరంలో అతిసార వ్యాప్తి నియంత్రణకు తాగునీటి పైపులైన్లు, డ్రైనేజీ

వ్యవస్థలను పునరుద్ధరిస్తున్నామని పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని అతిసార ప్రభావిత ప్రాంతాలలో పర్యటించిన ఆయన ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను నిన్న పరామర్శించారు. అనంతరం నగర పాలక సంస్థ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, నగరంలో డ్రైనేజీల పునరుద్ధరణ, మరమ్మతుల కోసం తక్షణమే 12 కోట్ల రూపాయలను విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సురక్షిత మంచినీటిని అందించేందుకు 60 కోట్ల రూపాయలతో పనులను వచ్చే నెల నుంచి మొదలు పెడతామని మంత్రి నారాయణ పేర్కొంటూ,

వాయిస్..25 సెకన్లు

---------------------------

ఢిల్లీలోని యశోభూమి వేదికగా జరుగుతున్న దక్షిణాసియా ప్రయాణ, పర్యాటక మార్పిడి–SATTE కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ప్రతినిధులు పాల్గొని టూర్ ఆపరేటర్లతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పర్యాటక అవకాశాలను, అందిస్తున్న సేవలు, ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఆంధ్ర ప్రదేశ్ పర్యాటక పోర్టల్‌లో నమోదు చేసుకున్న టూర్ ఆపరేటర్లను జాతీయ–అంతర్జాతీయ సంస్థలతో అనుసంధానం చేసేలా అవకాశాలు కల్పిస్తున్నామని అధికారులు పేర్కొన్నారు.

---------------------------

రైల్వే పార్శిల్ యాప్ ద్వారా ఇంటి నుంచే బుకింగ్, డెలివరీ సదుపాయం కల్పిస్తున్నామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు. రైల్ పార్శిల్ యాప్‌ను ఆయన నిన్న హైదరాబాద్ లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, విశాఖ, రాజమహేంద్రవరం, బెంగళూరు, చెన్నై వంటి 7 నగరాల్లో దీని ద్వారా సేవలు అందించనున్నట్టు పేర్కొన్నారు. 3 రకాల లాజిస్టిక్ సంస్థల భాగస్వామ్యంతో డోర్ డెలివరీ, మిడిల్ డెలివరీ, మెయిన్ డెలివరీ చేస్తామని చెప్పారు. ఈ రైల్ పార్శిల్ యాప్‌తో సులువుగా, వేగంగా సేవలు అందుతాయని సంజయ్ కుమార్ శ్రీవాస్తవ తెలిపారు.

---------------------------

ఉపరితల ద్రోణి ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తా జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాయలసీమలో ఎండ తీవ్రత కొనసాగుతుందని పేర్కొంది.

తెలంగాణాలోనూ కొన్ని జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================